రామన్‌పాడు దారి అధ్వానం

- కంపచెట్లతో నిండుకున్న రోడ్డు
- గుంతలమయంతో ప్రమాదాలు



రామన్‌పాడు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా దట్టంగా కంపచెట్లు



గుంతలమయమైన రోడ్డు

ఆత్మకూర్: ఆత్మకూర్ నుంచి రామన్‌పాడ్ ప్రాజెక్టుకు వెళ్లే మార్గం అధ్వానంగా తయారైంది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే ఈ రోడ్డు గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో ఇరువైపులా కంప చెట్లు కప్పేశాయి. దీనికి తోడు రోడ్డంతా గుంతలమయం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీజేపీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయడంతో పాటు కంప చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

హాకీ క్రీడాకారులకు అభినందన



వనపర్తి క్రైం: రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవడంపై శనివారం మంత్రి నిరంజన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులను అభినందించారు. ముస్ముందు హాకీలో క్రీడాకారులు మరింత ఉన్నతంగా రాణించి మన ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కుమార్, దయానంద్, రమేష్, కోచ్ జావేద్ ఉన్నారు.

మంత్రి పరామర్శ

పెబ్బేరు: మండలంలోని బున్యాదిపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు వనం మల్లేష్ యాదవ్ భార్య స్వాతి మృతి చెందడంతో శనివారం మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ శైలజ, సర్పంచ్ గోవిందమ్మ, బుచ్చారెడ్డి, రాములు యాదవ్ తదితరులు ఉన్నారు.

విగ్రహా ఏర్పాటుకు విరాళం

కొత్తకోట: ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు శనివారం మదనాపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదగిరి రూ.30,116, పట్టణానికి చెందిన అనిల్‌కుమార్ రూ.25వేలు విరాళంగా అందజేశారు. పట్టణ సమీపంలోని హైదరాబాద్ రోడ్డులో బైపాస్ వద్ద ఏర్పాటు చేస్తున్న విగ్రహం రాష్ట్రంలోనే అతి పెద్దదని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రహ్లాద, మహేష్, నరేష్, శ్రీకాంత్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

శివ భక్తుల అన్నదానం కోసం..

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని స్థానిక అంబ భవానీ ఆలయంలో శివ భక్తుల కోసం కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి శనివారం మండలంలోని సంకిరెడ్డిపల్లి చెందిన సరితా రాఘవరెడ్డి దంపతులు రూ. 10,116లు విరాళంగా అందజేశారు.

ముగిసిన అబ్దుల్ రహీం ఉర్సు

మదనాపురం: మండలంలోని దుప్పల్లి అబ్దుల్ రహీం ఉర్సు దివ్య ఖురాన్ పఠనంతో ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలకు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శనివారం దివ్య ఖురాన్ పఠనంతో పాటు రాత్రి తోశ ఫాతేహా చేపట్టారు. కార్యక్రమానికి తాండూర్ పీఠాధిపతులు అబ్దుల్ సబేర్ పాషా, అజిత్ పాష ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉదయం నుంచి దర్గా షరీఫ్‌కు మొక్కులు తీర్చుకునేందుకు భక్తుల తాకిడి పెరిగింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్రాలు, అన్నదానం, తాగునీటి వసతులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇసుక నిల్వలపై చర్యలేవి?

ఖిల్లాఘనపురం: మండలంలోని పిల్లివాగు వద్ద ఉన్న ఇసుక నిల్వలపై ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి తహసీల్దార్ భానుప్రకాష్‌ను ప్రశ్నించారు. నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. 25వ తేదీన ప్రజల నుంచి సమాచారం రావడంతో మండల నాయకులు వాగు వద్దకు వెళ్లి ఇసుక డంపులు, హిటాచీ తదితర వాటిని ఫొటోలు తీసుక వచ్చి చూయించడంతో పాటుగా డీటీని తీసుకెళ్లి చూయించారన్నారు. ఇసుక తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పి, ఇప్పుడు అనుమతులు ఇచ్చామని చెప్పడం ఎంత వరకు సమంజసం అన్నారు.

గీత కార్మికులకు బైక్‌లు ఇవ్వాలి

ఖిల్లాఘనపురం: జిల్లాలోని ప్రతి గీత కార్మికుడికి బైక్‌లు ఇవ్వాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు గోద ఆంజనేయులుగౌడ్ అన్నాడు. శనివారం మండలంలోని పలుగ్రామాల్లో మండల సంఘం నాయకులతో కలిసి పర్యటించిన ఆయన ఆయా గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాంజనేయులుగౌడ్, కృష్ణయ్యగౌడ్, మన్నెంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వివక్ష చూపితే ఉద్యమిస్తాం



తండాలో సమస్యలపై ఆరా తీస్తున్న సర్పంచ్

పాన్‌గల్: పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు అనుగుణంగా జాతీయ పురస్కారం అవార్డుల ఎంపికలో గిరిజన తండాలపై అధికారులు వివక్షత చూపితే ఉద్యమిస్తామని తెల్లరాళ్లపల్లితండా సర్పంచ్ శాంతమ్మ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో పలు కాలనీలల్లో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. అవార్డులకు మండలంలో ఎంపిక చేసిన జీపీల్లో నిబంధనలకు విరుద్ధంగా, అభివృద్ధి పనులు చేయకపోయినా మండల స్థాయి అధికారులు ఎంపిక చేశారన్నారు. అభివృద్ధి చేసిన మా తండాను అధికారులు సిఫార్సు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఎస్టీ కమిషన్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఈదమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పాన్‌గల్: మండల కేంద్రంలో మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ఈదమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అధికారులకు, కమిటీ సభ్యులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వాహనాల పార్కింగ్, తాగునీటి వసతి, వైద్య శిబిరం, పారిశుద్ధ్య చర్యలు, భద్రత అంశాలపై చర్చించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, హెచ్‌సీ చంద్రశేఖర్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ హైమావతి, కార్యదర్శి రఘు, బాలస్వామి, నాగన్న, దశరథనాయుడు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత: నిరుద్యోగ భృతికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నాయకులతో కలిసి సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పెట్టిన రైతు రుణమాఫీ, డబుల్ బెడ్రూంలు,ద ళితులకు మూడెకరాలు, ఇంటికో ఉద్యోగం అంటూ ప్రజలను మోసం చేసిన సీఎం కేసీఆర్ పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. నిరుద్యోగులకు నెలకు ఇస్తానన్న రూ.3106 నిరుద్యోగ భృతికి మాత్రం నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో ప్రతాప్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా ముందుకెళ్దాం



నియోజకవర్గ అధ్యక్షుడు తులసిరాజ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ అధికారమే లక్ష్యంగా ముందుకెళ్లాలని నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటిశ్రీహరి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గ్రామాల్లో ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 6వ తేదీ నుంచి చేపట్టనున్న హాత్‌సే హాత్ జోడో యాత్రను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్ మాట్లాడుతూ.. అనంతరం మక్తల్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు తులసీరాజ్‌యాదవ్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొద్దాం

అమరచింత: నిరంకుశ పాలన నుంచి మళ్లీ ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చేందుకు మరోమారు పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికులుగా పని చేయాలని టీపీసీసీ సహాయ కార్యదర్శి కేశం నాగరాజ్‌గౌడ్, పేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని మిట్టనందిమళ్ల గ్రామంలో శనివారం హాత్‌సేహాత్ జోడో అభియాన్ యాత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వైఫల్యాలు, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అయ్యుబ్‌ఖాన్, నర్సింహులు మహేందర్ రెడ్డి, ప్రశాంత్‌బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు




కృష్ణా జలాలను తీసుకువస్తున్న భక్తులు



నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం క్షేత్రంలో శనివారం భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలను వేదపండితుడు వెంకటశేషశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్షేత్రంలో సుబ్రమణ్యస్వామి, నవగ్రహాలు, దత్తాత్రేయ స్వామివారి ప్రతిష్ట చేపట్టి 41 రోజులు అయిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. నది నుంచి కృష్ణాజలాలను తీసుకువచ్చి మూలవిరాట్‌లకు జలాభిషేకం, పంచామృతాభిషేకం, కలశ పూజ, సూర్యభగవానుడికి పూజలు చేశారు. అనంతరం భక్తలకు అన్నదాన, ప్రసాద వితరణ నిర్వహించారు.

అభివృద్ధి కోసం కలిసి అడుగులేద్దాం



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: మున్సిపాలిటీ అభివృద్ధి కోసం త్వరలో రూ.10కోట్ల నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలోని ఆయా వార్డులలో సీసీ రోడ్డు పనులకు శనివారం అడిషనల్ కలెక్టర్ అశిషసంగ్వాన్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో ప్రస్తుతం ప్రధాన రహదారులతో పాటు, అంతర్గత రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. రాజకీయాలను పక్కన పెట్టి మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసి అడుగులు వేయాలని ఎమ్మెల్యే సూచించారు. కౌన్సిలర్లు తమ వార్డులలోని ప్రధాన సమస్యలను గుర్తించి, అవసరమయ్యే నిధులను మంజూరు చేసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల కోసం నిధులు పుష్కలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకీ మహర్షి

రామాయణం గ్రంథం అందించి సమస్త లోకానికి వాల్మీకి మహర్షి ఆదర్శ ప్రాయుడయ్యాడని ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని కిష్టంపల్లిలో శనివారం వాల్మీకి మహర్షి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు చేశారు.

రైతుల శ్రమను గుర్తించాలి



వీపనగండ్ల: ఆరుకాలం కష్టపడి పట్టెడన్నం పెట్టే రైతుల శ్రమను గుర్తించినప్పుడే వారికి విలువ ఇచ్చినట్లు అవుతుందని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కృష్ణయ్య, ఎస్‌ఐ రామన్‌గౌడ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పలు పథకాలు తెచ్చినా వాటిపై అవగాహన లేక కొందరు సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. అదేవిధంగా గౌడసంఘం క్యాలెండర్లను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్, సూర్యనారాయణ, రవీందర్‌రెడ్డి, ఆశన్న, గోపి, కృష్ణయ్యగౌడ్, బసవరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): రాష్ట్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రారంభించే హాత్‌సే హాత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కోఆర్డినేటర్ బ్రహ్మంఆచారి, కౌన్సిలర్ రణధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వారు శనివారం మండల కేంద్రంలోని రంగనాయక స్వామి ఆలయంలో కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్క కార్యకర్త ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాములుయాదవ్, రాముడు, బానుప్రకాష్, గంగాధర్‌యాదవ్, ఆశన్న, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్‌లో చింతల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం, గండదీప, బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. గ్రామంలో మూడు రోజులు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆదివారం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, వేదపారాయణం, చతుస్థానార్చన, నిత్య పూర్ణహుతి, శాత్తుమైరై, తీర్థప్రసాద వితరణ, సోమవారం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, వేదపారాయణం, చతుస్థానార్చన, మహాకుంభావాహము, చక్రాబ్జా మండలారాధన, మూల మన్రహనం, నిత్య పూర్ణహుతి ఉంటాయన్నారు. మంగళవారం వేదపారాయణం, చతుస్థానార్చన, క్షీరాధివాసం, సుదర్శన నారసింహ సహిత లక్ష్మీవేంకటేశ్వర హవనం, నిత్య పూర్ణాహుతి, కర్మంగ స్నపనం, శాత్తుమెరై తీర్థగోష్టి అనంతరం గ్రామోత్సవం, అధివాస హోమం, యంత్ర శక్యది తదితర పూజలు ఉంటాయన్నారు. ఫిబ్రవరి 1న బుధవారం గర్తపూజ అనంతరం మహాయంత్ర స్థాపన, బొడ్రాళ్ల ప్రతిష్ఠ, ద్వారాలపాలక, నవగ్రహ, గణపతి, గరుడ, బలిపీఠ, నాగ, గండాదీపా, ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తారని తెలిపారు.

పశువైద్య శిబిరాలు వినియోగించుకోండి



పాత సూగూర్‌లో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

పెబ్బేరు: మండలంలోని పాత సూగూర్‌లో పశువైద్య శిబిరాన్ని శనివారం ఎంపీపీ శైలజ, సర్పంచ్ వెంకటస్వామి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ పీవీ నర్సింహరావు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ద్వారా పశు వైద్య శిబిరాలను గ్రామాలలో నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతులు తమ జీవాల వ్యాధులకు చికిత్స చేయించుకుని, మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, రైతులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్(శ్రీరంగాపురం): మండలంలోని వెంకటాపురంలో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించారు. సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథం నాయుడు, సర్పంచ్ నాగన్న, మండల పశువైద్యాధికారి మాధవి ప్రారంభించారు.

ఉద్యమ స్ఫూర్తిని తెలియజేయాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల: తెలంగాణ ఉద్యమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు చూపించిన ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరికి తెలియజెప్పాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నో త్యాగాల ఫలితంగా సిద్ధించిన రాష్ట్రంలో ప్రతి ఒక్కరు రాష్ట్ర సాధన ఫలితాలను పొందాలని అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉద్యమకారులకు తనను అభిమానించే కార్యకర్తలు, ప్రజలకు అన్ని వేళలో అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, సర్పంచ్ నరసింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, గోపి, కురుమయ్య, గంగిరెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: మండలంలోని ప్రతి పాఠశాల ఆవరణలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని చింతకుంట ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు వీలుగా కేటాయించిన మొక్కలను గ్రామ నర్సరీలో పరిశీలించారు. మొక్కలను వెంటనే ఆవరణలో నాటించాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం కొత్తగా నిర్మిస్తున్న ఉన్నత పాఠశాల భవనాన్ని పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి



రైతులకు సూచనలు చేస్తున్న ఏఈఓ

పాన్‌గల్: వరి పంటకు ఆశించే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాడాల్సిన మందులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఏఈఓ శైలజ తెలిపారు. శనివారం మండలంలోని బండపల్లిలో రైతులు సాగుచేసిన వరి పంటలను పరిశీలించి సూచనలు, సలహాలను రైతులకు వివరించారు. జింక్ లోపం, కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు, వేరుకుళ్లు వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాన్‌గల్: గ్రామాల్లో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని హెచ్‌సీ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాల వివరాలను చెప్పవద్దని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పద్మనాభరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు



విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ లక్ష్మి తోడ్పాటుతో అల్పహారం అందించే కార్యక్రమాన్ని శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాట్లాడారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 84 మంది విద్యార్థులు ఉదయం వేళ ప్రత్యేక తరగతులకు హాజరవుతుండటంతో అల్పాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ హైమావతి, హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆత్మకూర్: పాలకులు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతోనే దళితులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లి అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్వహించి, స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్, బీఎస్పీ, సీపీఎం, సీపీఐ, ప్రజాపంథ సంఘాల నాయకులు మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం రోజున దళితకాలనీపై అకారణంగా దాడులకు తెగబడ్డ పిన్నంచర్ల సర్పంచ్ భర్త, వర్గీయులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కులం పేరిట దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిర్లక్ష్యం వీడి దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. పిన్నంచర్ల గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి దళితులకు రక్షణ కల్పించాలని తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అజయ్, విజయ్, కుర్మన్న, అరుణ్ కుమార్, మహమూద్, ప్రసాద్, రాజేందర్, మన్యం, ప్రసాద్, రాజు, ప్రకాష్, రాజు, బుచ్చన్న, వెంకటన్న, పిన్నంచర్ల గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి



పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజల సంపూర్ణంగా సహకరించాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం 9వ వార్డులో కౌన్సిలర్ మండ్లరామకృష్ణ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, రవియాదవ్, కౌన్సిలర్లు చెన్నయ్య, పోషన్న, తబస్సుంమోసీన్, యాదమ్మ, కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌అలీ, సిబ్బంది ఉన్నారు.

సీనియర్ నాయకుడికి నివాళి

మదనాపురం: మండలంలోని రామన్‌పాడుకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అడివన్న శనివారం మృతి చెందాడు. జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్, సర్పంచ్ కురుమూర్తి, సత్యం యాదవ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. నివాళులు అర్పించిన వారిలో పాషా, మనోజ్‌కుమార్, ఖాజా మైనుద్దీన్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.